# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 05-సెప్టెంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 93 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


# హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం కీలక ఆదేశాలు

“హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలి. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి రాజీ ఉండకూడదు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి ఈ హబ్ కీలకంగా మారాలి. వర్షపు నీటి సంరక్షణ, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దాలి.”

## హకీంపేట్‌లో సీఎం రేవంత్ పర్యటన

**నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక ఆదేశాలు**

**విద్యా సంస్థలు, ఆసుపత్రి భవనాల తనిఖీ**

**వర్షపు నీటి సంరక్షణకు ప్రణాళికలు**



**హకీంపేట్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ అధికారులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని పేర్కొంటూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల, వెటర్నరీ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల భవనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే 400 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆసుపత్రి భవన సముదాయంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హాస్టళ్ల నిర్మాణాలను కూడా తనిఖీ చేశారు. ప్రతి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న అన్ని నిర్మాణ పనులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే ప్రాజెక్టు నిర్దేశిత గడువులో పూర్తవుతుందని పేర్కొన్నారు. సాంకేతిక అంశాలు, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## కొండా సురేఖ తొలగింపు బాధాకరమే..

### కానీ పార్టీ క్రమశిక్షణే ముఖ్యం: మహేశ్ కుమార్ గౌడ్

- క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమన్న టీపీసీసీ చీఫ్
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ
- అంతర్గత వేదికలు ఉండగా మీడియా ముందుకు రావడం సరికాదన్న వ్యాఖ్య
- కాంగ్రెస్‌లోనే కొనసాగితే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని సూచన

2లో



## స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధికి భంగం కలిగించొద్దు..

### కల్వకుంట్ల కవిత

- బంజారాహిల్స్‌లో కార్మికులతో సమావేశం
- చెత్త సేకరణ వ్యవస్థలో మార్పులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కవిత
- కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):** బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో స్వచ్ఛ ఆటో కార్మికులతో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు తమ ఉపాధికి సంబంధించి ఎదురవుతున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చెత్త సేకరణ వ్యవస్థలో ప్రతిపాదిత మార్పుల వల్ల వేలాది మంది కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, నగరంలో స్వయం ఉపాధి ద్వారా జీవనం సాగిస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో





## బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి సీతక్క కౌంటర్

- ‘పచ్చ కాంగ్రెస్’ వ్యాఖ్యలు హాస్యాస్పదమని వ్యాఖ్య
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపక్షాల వైఖరిని తప్పుబట్టిన మంత్రి
- వ్యక్తిగత దూషణలు, కించపరిచే రాజకీయాలను సహించబోమని హెచ్చరిక

**ములుగు, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):** ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చిన నాయకులతో బీఆర్ఎస్ నిండిపోయి ఉండగా కాంగ్రెస్‌ను ‘పచ్చ కాంగ్రెస్’గా అభివర్ణించడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. ములుగులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె, ఇతర పార్టీల నాయకులను పెద్ద ఎత్తున చేర్చుకున్న బీఆర్ఎస్‌కు ఇలాంటి విమర్శలు చేసే నైతిక హక్కు లేదన్నారు. కేటీఆర్ ఇతర పార్టీల గురించి మాట్లాడే ముందు తమ పార్టీ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లోకి ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు లేరా అని ప్రశ్నించిన మంత్రి, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వచ్చిన వారిని బట్టి రాజకీయ ప్రమాణాలు మారవని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

## గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు..

### మంత్రి పొన్నం ప్రభాకర్

- యూనియన్ ప్రతినిధులతో సమావేశమైన రవాణా శాఖ మంత్రి
- యాప్ ఆధారిత రవాణా రంగ సమస్యలపై వినతి
- డ్రైవర్ల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యమన్న మంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):** గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రి క్వార్టర్స్‌లో ఆయనను కలిసి ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత రవాణా రంగానికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌పై సీఎం కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి దశలో పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎడ్యుకేషన్ హబ్ పరిధిలో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని సేకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. భవిష్యత్తులో నీటి వనరుల పరిరక్షణకు ఇది ఉపయోగపడటమే కాకుండా, ల్యాండ్‌స్కేపింగ్ పనులకు కూడా వర్షపు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా హరితాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేలా విశాలమైన పచ్చదనం, ఆధునిక మౌలిక సదుపాయాలు, సౌకర్యవంతమైన హాస్టల్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు ఒకే వేదికగా హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌ను ఆదర్శవంతమైన విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# కొండా సురేఖ తొలగింపు బాధాకరమే..

## కానీ పార్టీ క్రమశిక్షణే ముఖ్యం: మహేశ్ కుమార్ గౌడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం వ్యక్తిగతంగా బాధ కలిగించేదేనని పేర్కొంటూనే, పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ నియమాలను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయిలో ఉన్న నాయకులైనా చర్యలు తప్పవని, కాంగ్రెస్ అధిష్ఠానం క్రమశిక్షణ విషయంలో రాజీ పడదని తేల్చి చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.

కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఆ వ్యాఖ్యలను కొండా సురేఖ వెంటనే ఖండించకపోవడం కూడా అధిష్ఠానం దృష్టికి వెళ్లిందన్నారు. ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ సమగ్ర నివేదిక అందించగా, దాని ఆధారంగానే చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశాలపై అధిష్ఠానం కఠిన వైఖరితో వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

పార్టీలో ఏవైనా అభిప్రాయ భేదాలు లేదా సమస్యలు ఉంటే వాటిని చర్చించేందుకు అనేక అంతర్గత వేదికలు అందుబాటులో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు వంటి నాయకులతో చర్చించే అవకాశం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ వ్యవహారాలను బహిరంగంగా మీడియా ముందుకు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను సహించబోమని హెచ్చరించారు.

"కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు పాటించాల్సిందే. క్రమశిక్షణను అతిక్రమిస్తే చర్యలు అనివార్యం" అని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అయితే కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకురాలని, ఆమె పార్టీని వీడకుండా కొనసాగాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో కొనసాగితే భవిష్యత్తులో అవకాశాలు తప్పకుండా వస్తాయని సూచించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలను కూడా మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించిందని, వ్యక్తిగత రాజకీయాలకు తావు లేదన్నారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని వివరించారు.

అలాగే భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల విషయంలో పార్టీ కట్టుబడి ఉందన్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన పరిణామం తెలంగాణ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసిన నేపథ్యంలో మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# స్వచ్ఛ ఆటో కార్మికుల ఉపాధికి భంగం కలిగించొద్దు..

(మొదటి పేజీ తరువాయి)



ఇంటింటికీ చెత్త సేకరిస్తూ నగర పరిశుభ్రతకు తోడ్పడుతున్న కార్మికుల ఉపాధికి భంగం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల వేలాది కుటుంబాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని అన్నారు.

ప్రస్తుతం చెత్త సేకరణ సేవల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికులను ప్రైవేట్ సంస్థల ఆధీనంలో పనిచేసే ఉద్యోగులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. స్వయం ఉపాధితో గౌరవప్రదంగా జీవిస్తున్న కార్మికుల ఆర్థిక భద్రతకు భంగం కలగకుండా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణకు సంబంధించిన చార్జీలను ఆస్తి పన్నుతో అనుసంధానం చేసే ప్రతిపాదనలపై కూడా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. ఈ విధానం అమలైతే ప్రస్తుత వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛ ఆటో కార్మికులు నగర పరిశుభ్రతకు విశేష సేవలు అందిస్తున్నారని కవిత కొనియాడారు. వారికి తగిన భద్రతా చర్యలు, బీమా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డంపింగ్ యార్డుల వద్ద కనీస మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని, కార్మికుల పనివాతావరణాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, ఉపాధి పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ విమర్శలకు మంత్రి సీతక్క కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)



మీ పార్టీలోకి వస్తే పవిత్రులు, ఇతర పార్టీల్లో ఉంటే అనైతికులా అనే ప్రశ్నను ఆమె లేవనెత్తారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, ద్వంద్వ వైఖరికి తావు ఉండకూడదన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీతక్క ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించాలని మంత్రి డిమాండ్ చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చేసిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించే ముందు తమ పాలనపై సమాధానం చెప్పాలని సూచించారు.

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై లెక్కలతో సహా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ, పంట బోనస్, ఉద్యోగాల భర్తీ, మహిళా సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలపై బహిరంగ చర్చకు రావాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన మేలు ఏమిటో కూడా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు హుందాగా, గౌరవప్రదంగా ఉండాలని సీతక్క అన్నారు. వ్యక్తిగత దూషణలు, కించపరిచే పోస్టర్లు, అవమానకర రాజకీయాలను సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు సహజమే అయినా, వ్యక్తిగత స్థాయికి దిగజారి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగానే గట్టి సమాధానం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు..

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను యూనియన్ ప్రతినిధులు అభినందించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం ముందడుగు వేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రవాణా రంగ కార్మికులకు మరింత సహాయం అవసరమని పేర్కొన్నారు.

మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలను త్వరితగతిన అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. యాప్ ఆధారిత రవాణా సేవల్లో పనిచేస్తున్న ఆటో, క్యాబ్, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లకు న్యాయం జరిగేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రంగంలో పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓలా, ఉబెర్, రాపిడో, పోర్టర్ వంటి యాప్ ఆధారిత రవాణా సంస్థలపై నియంత్రణకు సంబంధించి మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు-2025ను సమర్థవంతంగా అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించే కనీస బేస్ ఛార్జీ, కిలోమీటర్ ఛార్జీ, నిమిషం ఛార్జీలను తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల డ్రైవర్ల ఆదాయం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.

యాప్ ఆధారిత ప్రయాణికుల, సరుకుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ వాహనాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కూడా యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన చోట మోటార్ వెహికల్స్ చట్టం-1988 ప్రకారం వాణిజ్య రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హైర్ వెహికల్ ఛార్జీల పెంపుపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు సమర్పించిన అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో, క్యాబ్, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్రైవర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా రవాణా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.





# ఐఎస్‌ఓఐ జాతీయ సదస్సుకు మంత్రి దామోదర్ శ్రీకారం

- **హైదరాబాద్‌లో 32వ వార్షిక జాతీయ సదస్సు ప్రారంభం**
- **ఆధునిక దంత వైద్యంలో ఇంప్లాంటాలజీ కీలకమన్న మంత్రి**
- **ప్రభుత్వ ఆసుపత్రుల్లో దంత సేవల విస్తరణకు చర్యలు**
- **ఓరల్ క్యాన్సర్ నివారణపై ప్రత్యేక దృష్టి అవసరం**

హైదరాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరల్ ఇంప్లాంటాలజిస్ట్స్ (ఐఎస్‌ఓఐ) 32వ వార్షిక జాతీయ సదస్సును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఘనంగా ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి హాజరైన దంత వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఆధునిక వైద్య రంగంలో ఓరల్ ఇంప్లాంటాలజీ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటూ, ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఓరల్ ఇంప్లాంటాలజీ కేవలం కోల్పోయిన దంతాలను భర్తీ చేసే ప్రక్రియ మాత్రమే కాదని, రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే సమగ్ర వైద్య విధానమని మంత్రి వివరించారు. నమలే సామర్థ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు సౌందర్యాన్ని పెంపొందించడం, ఆత్మవిశ్వాసాన్ని తిరిగి కల్పించడం వంటి అనేక ప్రయోజనాలు ఇంప్లాంట్ డెంటిస్ట్రీ ద్వారా సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ వైద్య విధానం దంత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన దంత వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా దంత వైద్య సేవలను విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో సుమారు 50 మంది డెంటల్ డాక్టర్ల నియామక ప్రక్రియను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమానంగా నాణ్యమైన దంత చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలోనే కాకుండా తెలంగాణలో కూడా ఓరల్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నివారణ, ముందస్తు గుర్తింపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం, ఇతర అనారోగ్యకర అలవాట్ల కారణంగా నోటి క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

ప్రజల్లో నోటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో దంత వైద్యులు కీలక బాధ్యత వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన దంత సంరక్షణ పద్ధతులు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నోటి ఆరోగ్యాన్ని సాధారణ ఆరోగ్యంతో అనుసంధానం చేస్తూ సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంచాలని కోరారు. ఈ జాతీయ సదస్సు ద్వారా దంత వైద్య రంగంలోని తాజా సాంకేతికతలు, పరిశోధన ఫలితాలు, ఆధునిక చికిత్సా విధానాలపై వైద్య నిపుణులకు విస్తృత చర్చలు జరిగే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సదస్సులు వైద్యుల నైపుణ్యాలను మరింత పెంపొందించడమే కాకుండా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా దంత వైద్య రంగ అభివృద్ధికి ఈ సదస్సు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# కొడిమ్యాలలో కాంగ్రెస్ విజయోత్సవం



- 1000 బైక్‌లతో భారీ ర్యాలీ.. పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- ర్యాలీతో దద్దరిల్లిన కొడిమ్యాల.. కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

**కరీంనగర్, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):**కొడిమ్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంగడి బజార్ నుంచి పూడూర్ చౌరస్తా వరకు సుమారు 1000 బైక్‌లతో భారీ ర్యాలీ చేపట్టారు.

చౌరస్తా వద్ద మండల ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం సంబరాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుడికి అభినందనలు

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**పెబ్బేరు,సెప్టెంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని చెంచువాడ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన ఉపాధ్యాయుడు డి. చిన్న రాములుకు 2026 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం అభినందనీయమని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు.2024 జూలైలో చెంచువాడ పాఠశాలకు వచ్చిన సమయంలో కేవలం 40 మంది విద్యార్థులు ఉండగా, పాఠశాల ఆవరణ పొదలు, మట్టి దిబ్బలతో అధ్వానంగా ఉండేదన్నారు. స్థానికుల సహకారంతో పాఠశాల ఆవరణను శుభ్రం చేసి అభివృద్ధి చేయడంతోపాటు, వినూత్న కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. దీంతో విద్యార్థుల సంఖ్య 2025-26లో 96కు, 2026-27లో 136కు పెరిగిందన్నారు.తరగతి గదుల కొరత ఉన్నప్పటికీ సొంత ఖర్చులు, దాతల సహకారంతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి విద్యాబోధన కొనసాగించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చిన్న రాములు కృషి ఆదర్శంగా నిలుస్తుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.

# కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**పెబ్బేరు,సెప్టెంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** కళాకారులు సమాజానికి, సంస్కృతికి ప్రతిబింబాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. పెబ్బేరు పట్టణంలో వీఎంసీ సంగీత రికార్డింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఔత్సాహిక గాయకులు, కళాకారులను ప్రోత్సహిస్తున్న యెల్లా రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యెల్లా రెడ్డిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి సంగీత కేంద్రాలు ఎంతో అవసరమన్నారు. తెలంగాణ జానపద కళలను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.కార్యక్రమంలో పృథ్వీరాజ్, వెంకటస్వామి, షఫీ, చంద్రయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల ప్రజాపాలనపై కాంగ్రెస్ జోష్



- ఇందిరా చౌక్‌లో భారీ బైక్ ర్యాలీ.. పాల్గొన్న కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

**కరీంనగర్, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రజాపాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ నాయకులు ఉత్కూరి నరేందర్‌రెడ్డి, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన విజయాలను చాటుతూ సాగిన ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది

- రూ.5 లక్షల ఆర్థిక సాయం.. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు.
- ఆసుపత్రి నిర్లక్ష్యంపై విచారణ.. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు



**అశ్వారావుపేట, సెప్టెంబరు 4 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతి ఊకె శిరీష కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తున్న శిరీష ఇటీవల హత్యకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి చౌటిగూడెం గ్రామానికి చేరుకుని శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు. అదేవిధంగా శిరీష కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేసి పట్టాను అందించారు. శిరీష మృతి ఘటనలో ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై విచారణ జరిపిస్తామని మంత్రి తెలిపారు. విచారణలో ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శిరీషను హత్య చేసిన నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిన మంత్రి, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన





- ప్రజా సమస్యలను గాలికొదిలి వేడుకలా? — బోయినపల్లి వినోద్‌కుమార్
- కరీంనగర్ కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ వంటా వార్పు.. గంగుల కమలాకర్‌తో కలిసి నిరసన

**కరీంనగర్, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించే ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ లైబ్రరీ చైర్మన్లు రవీంద్రరెడ్డి, అనిల్‌గౌడ్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు హరిశంకర్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు

- బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున చేరికలు.. రంగాపూర్‌లో గ్రామ కమిటీ ఏర్పాటు



**హుజురాబాద్,సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):**తెలంగాణ రాజ్యాధికార పార్టీ హుజురాబాద్ మండల అధ్యక్షుడు *తిరగమల్ల నాగార్జున* ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీగా చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి నాయకులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున మాట్లాడుతూ బహుజనులు, పీడిత ప్రజల హక్కుల కోసం ఏర్పాటు చేయబడిన పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను గ్రామంలోని ప్రతి గడపకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఎగిరేంత వరకు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు.

బహుజన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత, సామాజిక న్యాయం అందించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి బొడ్డు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగాపూర్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రంగాపూర్ గ్రామ కమిటీ: అధ్యక్షుడిగా బొడ్డు దేవదాసు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండ ఇస్సాకు, కోశాధికారిగా బొడ్డు తిరుపతి, అధికార ప్రతినిధిగా శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా బొడ్డు సుమన్, కార్యదర్శిగా బొడ్డు మహేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బొడ్డు శ్రీను, బండ రాజేందర్, తునికి రమేష్, బండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వ్యాఖ్యలపై మాల మహానాడు ఆగ్రహం

- వరప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**దుబ్బాక,సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్‌పై సోషల్ మీడియా, టీవీ ఇంటర్వ్యూలలో అవమానకర వ్యాఖ్యలు చేస్తూ, భారత రాజ్యాంగాన్ని వక్రీకరించే విధంగా మాట్లాడుతున్న హమారా ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుబ్బాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ గారి ఆదేశాల మేరకు, రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ ఎలుక దేవయ్య గారి సూచనలతో ఈ ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించే రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం, రాజ్యాంగం గురించి వక్రీకరించి మాట్లాడటం కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు.

సోషల్ మీడియా, టీవీ కార్యక్రమాల ద్వారా ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లోకి వెళ్లడం బాధాకరమని, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఈ విషయంపై జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర శాఖ తరపున పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాజ్యాంగ నిర్మాతపై అవమానకర వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దుబ్బాక: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్‌పై సోషల్ మీడియా, టీవీ ఇంటర్వ్యూలలో అవమానకర వ్యాఖ్యలు చేస్తూ, రాజ్యాంగాన్ని వక్రీకరించే విధంగా మాట్లాడిన హమారా ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు.

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ ఎలుక దేవయ్య సూచనలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంబేద్కర్ దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించే రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. ఆయనపై, రాజ్యాంగంపై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. వరప్రసాద్‌పై సమగ్ర విచారణ జరిపి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మాల మహానాడు నాయకులు ఆస ముత్యం, బావాజీ రమేష్, ఐత స్వామి, లచ్చపేట నర్సింలు, బావాజీ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముదిరాజ్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం



- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ముదిరాజ్ కుల సంఘం

**వనపర్తి,సెప్టెంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నిర్వేన్ గ్రామానికి చెందిన శాంతన్న ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ కుల సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు.కానాయపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు దారమోని మహేష్ ముదిరాజ్ సహకారంతో బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం.. అంబేద్కర్ నగర్ వాసుల ఆందోళన



**మేడ్చల్ జిల్లా, జవహర్‌నగర్, కాప్రా, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాప్రా రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 245లో అంబేద్కర్ నగర్ బస్టాండ్ వద్ద ఉన్న సుమారు 100 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు.

అంబేద్కర్ నగర్‌లో 1992లో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి తాము ఇక్కడే నివాసం ఉంటున్నామని స్థానికులు తెలిపారు. అప్పట్లో అధికారుల సహకారంతో ఈ 100 గజాల స్థలాన్ని వినాయక మండపం కోసం కేటాయించుకున్నామని చెప్పారు.అయితే ప్రస్తుతం అదే స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టారని ఆరోపిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. మాజీ కార్పొరేటర్ మారగోని నాగరాణి భర్త వెంకటేష్ గౌడ్ ఈ స్థలాన్ని కబ్జా చేసి, ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారని వారు ఆరోపించారు.వినాయక చవితి సమీపిస్తున్న సమయంలో రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణం చేపట్టారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నిర్మాణాన్ని తొలగించి, వినాయక మండపానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి, స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# డీజిల్ లోకోషెడ్ లో ఘనంగా శ్రీకృష్ణ వేడుకలు



**కాజీపేట్ సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ జంక్షన్ పరిధిలోని రైల్వే డిజిల్ లోకో షెడ్ లో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని కృప కటాక్షాలు అందరిపై ప్రసరింపజేయాలని, ప్రతి ఒక్కరి కుటుంబాలలో సుఖ సంతోషాలు, ఆయురు ఆరోగ్యాలు, శాంతి, ఐశ్వర్యాలు లతో తులతూగాలని షెడ్డులో ప్రత్యేకలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి. ఎం. ఈ. అనికేత్ ఖడే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడిఎం ఈ నాగరాజు, ఏ డి ఈ సతీష్, ఎల్ ఎఫ్. రాజశేఖర్, ఈ ఎఫ్. అమల్ రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, సెక్రటరీ పాక వేద ప్రకాష్, రాముల సదానందం, ఆర్ నరేష్ యాదవ్ ,జి రాజేష్, సమ్మయ్య ,పండు, రాజలింగం లతోపాటు సూపర్వైజర్స్ మహిళ కార్మికులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటా వార్పు

**ఉప్పల్, సెప్టెంబర్ 4(తెలంగాణా ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. డా. ఏఎస్ రావునగర్, వంపుగూడ, మల్లాపూర్ అశోక్‌నగర్, నాచారం హెచ్ఎంటీ నగర్, రామంతాపూర్ ప్రాంతాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు 2,500 రూపాయలు, కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విమర్శించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.




కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలన.. కేసీఆర్‌పై కాంగ్రెస్ సమరభేరి

- పెద్దమందడిలో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

**పెద్దమందడి,సెప్టెంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు.ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకుండా, ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రజలకు దూరంగా ఉంటున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రజల కోసం



పనిచేయని కేసీఆర్ ప్రజాధనాన్ని పొందడం సరికాదని ఆరోపిస్తూ, తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొత్తకాపు వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్‌లపై తరలివచ్చారు.కాంగ్రెస్ పార్టీ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ పార్టీ నినాదాలతో హోరెత్తించారు. దీంతో పెద్దమందడి మండలంలో రాజకీయ సందడి నెలకొంది.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముల్కనూర్‌లో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





- ఉట్టి కొట్టు కార్యక్రమంతో సందడిగా మారిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణం

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలకు గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. అనంతరం భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు.ఉట్టి కొట్టు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు,యువకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు. శ్రీకృష్ణుడి నామస్మరణతో ముల్కనూర్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులు, యాదవ కులస్తులు,గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి , ముల్కనూర్.ఎస్ఐ రాజు ,బీజేపీ నాయకులు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, భక్తులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో అన్నదానం

- కీర్తిశేషులు బండారి సవరయ్య జ్ఞాపకార్థం భక్తులకు అన్నదాన కార్యక్రమం

**పెద్దమందడి,సెప్టెంబర్04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కీర్తిశేషులు బండారి సవరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బండారి నరసింహ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా



బండారి నరసింహ మాట్లాడుతూ.. తన తండ్రి కీర్తిశేషులు బండారి సవరయ్య జ్ఞాపకార్థం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇకముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బండారి నరసింహ కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను పలువురు గ్రామస్థులు అభినందించారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అష్టభుజాదేవి ఆలయం వద్ద యశోదా బాలగోకులం ఆధ్వర్యంలో నెల రోజులుగా ప్రతిరోజూ నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా ముగిశాయి.

ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు, స్థానికులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో పాల్గొని సందడి చేశారు. అష్టభుజాదేవి ఆలయం నుంచి శ్రీకృష్ణుడి విగ్రహంతో భక్తులు ఊరేగింపుగా బయలుదేరి విష్ణుపురి మీదుగా ఆనంద్‌బాగ్ వరకు, అక్కడి నుంచి తిరిగి అష్టభుజాదేవి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు.



కృష్ణుడు, రాధా వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను అలరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో యశోదా బాలగోకులం సభ్యులు విపిన్, దీపా వాసుదేవన్, బాబు, కన్నన్, దాసన్, ఉమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్

- (టీజే ఏ)జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా సయ్యద్ ఖాసీం



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ సయ్యద్ ఖాసీం( అక్షిత దిన పత్రిక బ్యూరో చీఫ్ ) నియమితులయ్యారు. టీజేఏ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా టీజేఏ జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) యూనియన్ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నాగ స్వామికి టీజేఏ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



## ఎలా ఉన్నావమ్మా... అక్షిత

- తల్లంపాడులో చిన్నారిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** తలంపాడు గ్రామానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని రెంటాల అక్షిత గతంలో తన అమ్మమ్మతో కలిసి బస్సులో వెళ్లి వస్తుండగా.. కిటికీ వద్ద కూర్చున్న చిన్నారి చేతికి మరో బస్సు ప్రమాదవశాత్తు తగిలి కుడి చేతికి తీవ్రగాయమైంది. గ్రామ సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్ ద్వారా విషయం తెలుసుకుని.. గతంలో కిమ్స్ ఆస్పత్రిలో మంత్రి తరఫున చికిత్స చేయించగా పూర్తిగా కోలుకుంది. తాజాగా శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆ చిన్నారి ఇంటికి వెళ్లి.. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని, తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అభయమిచ్చారు. అలాగే ఆ బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్, కస్నా తండా సర్పంచ్ పాపా నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు కృష్ణ, పంతులు నాయక్, గ్రామ పెద్ద ఎన్ వీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి చెమటకు బిడ్డ విజయంతో సమాధానం.. వైద్యురాలిగా షేక్ రీష్మ



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** తండ్రి కష్టానికి, తల్లిదండ్రుల త్యాగాలకు బిడ్డ సాధించిన విజయం మరుపురాని సమాధానంగా నిలిచింది. పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన షేక్ రీష్మ వైద్య విద్య ప్రవేశ పరీక్షలో 471 మార్కులు సాధించి, కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్య అభ్యసించే అవకాశం దక్కించుకుంది. రీష్మ కారేపల్లి తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యను అభ్యసించింది. ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో చదువుకుంటూ ఎన్నో కష్టాలను అధిగమించింది. చిన్ననాటి నుంచి వైద్యురాలు కావాలనే లక్ష్యంతో పట్టుదలగా చదివి, తన కలను సాకారం చేసుకుంది. రీష్మ తండ్రి షేక్ యాకూబ్ వలి తాపీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కుమార్తె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అండగా నిలిచారు. తండ్రి కార్చిన ప్రతి చెమట చుక్కకు, తల్లి చేసిన ప్రతి త్యాగానికి రీష్మ సాధించిన ఈ విజయం గొప్ప ప్రతిఫలంగా నిలిచింది.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ, పరిమిత వనరులతోనే పట్టుదలతో ముందుకు సాగి వైద్య విద్యలో సీటు సాధించిన రీష్మ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. "ఇది రీష్మ ఒక్కరి విజయం కాదు.. ఆమె కోసం కష్టపడిన తల్లిదండ్రుల విజయం కూడా" అని గ్రామస్థులు, బంధువులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ రీష్మను అభినందించారు.

తల్లిదండ్రుల కష్టం ఫలించింది..
కన్న కలను బిడ్డ నిజం చేసింది..
వైద్యురాలిగా ఎదుగుతున్న షేక్ రీష్మకు హృదయపూర్వక అభినందనలు.

## మహబూబ్‌నగర్ అభివృద్ధి ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ జిల్లాలో అమలవుతున్న పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం మరియు పునరుద్ధరణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్షించారు. భారత్‌మాల ప్రాజెక్టు, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ ప్రాజెక్టు, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎంజీకేఎల్ఐ, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. భూ యజమానులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిర్ణీత గడువుల్లో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శక విధానంలో భూసేకరణ పూర్తి చేయడం ద్వారా ప్రాజెక్టుల అమలుకు మార్గం సుగమం చేయాలని చెప్పారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# గత ప్రభుత్వ వైఫల్యంతోనే పోలవరం ముప్పు

- రాష్ట్ర విభజనప్పుడు మన ఏడు మండలాలు, భద్రాచలం చుట్టూ 5 గ్రామ పంచాయతీలను ఆంధ్రాకు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి
- మా విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరం
- భద్రాచలంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** గతంలో పదేళ్ళు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే.. మనకు పోలవరం ముప్పు పొంచి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భద్రాచలంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో... భద్రాచలం దేవస్థాన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలను, భద్రాచలం చుట్టుపక్కల ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేయడం బాధాకరమని అన్నారు.

ఇక్కడి విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోవాలి.. ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుతం వరదలు లేకున్నా... భవిష్యత్ లో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణం కంటే 2025 అడుగుల వరకు అధికంగా బ్యాక్ వాటర్ ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలో సి డబ్ల్యూ సి, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు విన్నవించినా.. వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. పోలవరానికి తాము వ్యతిరేకం కాదని .. తెలంగాణలో ముంపు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల నాటికి తెలంగాణ ఎంపీలు, గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి.. పోలవరం ప్రభావంతో జరిగే వరద ముప్పు తీవ్రతను వివరించి.. పునః పరిశీలించాలని కోరతామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో...:కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే శ్రీరామనవమి నాటికి అభివృద్ధి పనులు పూర్తవ్వాలి

- ముక్కోటి ఉత్సవాలకు ఉత్తర ద్వారం సిద్ధమవ్వాలి
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం లో ప్రత్యేక పూజలు
- అభివృద్ధి పనుల పరిశీలన

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని శుక్రవారం ఉదయం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దర్శించుకున్నారు. కలెక్టర్ అంకిత్,భద్రాచలం, పినపాక,అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు,జారే ఆదినారాయణలతో
కలసి రాగా..మంత్రి పొంగులేటిని భద్రాచలం ఐటీడీఏ పీ.ఓ రాహుల్, ఆలయ ఈఓ దామోదర్, తహసీల్దార్ రవి కుమార్, ఆలయ అధికారులు, అర్చకులు, ఘనస్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, మంత్రి పొంగులేటి సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. దేవాలయ అభివృద్ధి పునః నిర్మాణ పనుల పరిశీలన

చిత్రకూట మండపం పరిసరాలను, గోశాల ప్రాంతాన్ని, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాలయానికి వెళ్లే మార్గం, ఉత్తర ద్వార దర్శనం, రామాలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మాడవీధులను, పరిసర ప్రాంత అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సకాలంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఉత్సవాలలోపు ఉత్తర ద్వారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది ఏప్రిల్ లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలలోపు అన్ని పనులు పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.



రూ.276 కోట్లతో నాణ్యతలో రాజీ లేకుండా పనులు..

వచ్చే ఏడాది 2027 జూన్ జులైలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరీవాహక ప్రాంతంలో గల ఘాట్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రూ.276 కోట్ల నిధులతో తొలి విడతలో జరుగుతున్న ఈ పనులను.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు.

దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రం ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలలో పాల్గొని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, పనులు ప్రస్తుతం సంతృప్తిగా సాగుతున్నాయని మంత్రి వెల్లడిస్తూ..గోశాలలో రాజ గోపుర, ఇతర శిల్ప నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం





- ఇందిరా మహిళా శక్తి పథకం కింద టీ, టిఫిన్స్, మీల్స్, స్నాక్స్ క్యాంటీన్ల ప్రారంభం

**రామడుగు,సెప్టెంబర్4(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ, టిఫిన్స్, మీల్స్, స్నాక్స్ క్యాంటీన్లను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్ల ద్వారా వారికి స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు, తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే అవకాశం కలుగుతుందని తెలిపారు. మహిళలు కేవలం ఉపాధి పొందేవారిగా కాకుండా, భవిష్యత్తులో విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు.ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో వ్యాపార దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఈ కార్యక్రమంలో రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జవ్వాజి హరీశ్, ఎమ్మార్వో రాజమల్లయ్య, ఎస్ఐ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మర వేణి, తిరుమల తిరుపతి సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సర్పంచులు గుమ్మడి మల్లేశం, ఓంప్రకాష్, అనంతరెడ్డి, మొయిజ్, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజమ్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


# కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన విజయ్ కుమార్

- బీసీ మహిళా నాయకురాలికి అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

**వరంగల్, సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు):** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా నియమితులైన గుండు సుధారాణిని వరంగల్‌లోని ఆమె నివాసంలో తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గుండు సుధారాణికి వివిధ రాజకీయ పార్టీల్లో పలు పదవుల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. సీనియర్ మహిళా నాయకురాలిగా, కార్పొరేటర్‌గా, రాజ్యసభ సభ్యురాలిగా, వరంగల్ నగర మేయర్‌గా వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారని పేర్కొన్నారు.

తాను పనిచేస్తున్న పార్టీని నమ్ముకుని అంకితభావంతో కొనసాగుతున్న సుధారాణి సేవలను గుర్తించి, బీసీ మహిళగా ఆమెకు కుడా చైర్‌పర్సన్ పదవి కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బీసీ మహిళా నాయకత్వానికి ప్రాధాన్యత కల్పిస్తూ సుధారాణికి ఈ అవకాశం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వరంగల్ నగర, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తారనే ఆశాభావాన్ని విజయ్‌కుమార్ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అవునూరి రామమూర్తి, కుమ్మర శాలి వాహన తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**వేలేరు, సెప్టెంబర్4 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించగా వుట్టి కొట్టి గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణుని జయంతిని పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా భక్తులు ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# జమ్మికుంట ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. రెండు ప్రత్యేక రైళ్లు

- **సికింద్రాబాద్–కాగజ్‌నగర్ మధ్య రెండు జనసాధారణ ప్రత్యేక రైళ్లు**




**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్-కాగజ్‌నగర్ మధ్య రెండు జనసాధారణ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లు జమ్మికుంట మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. దీంతో జమ్మికుంటతో పాటు పరిసర ప్రాంతాల ప్రయాణికులకు రవాణా సౌకర్యం మరింత అందుబాటులోకి రానుంది.

సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు నడిచే రైలు నంబర్ 07235 సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు కాగజ్‌నగర్ చేరుకుంటుంది.

అదేవిధంగా కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు నడిచే రైలు నంబర్ 07236 కాగజ్‌నగర్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ఈ ప్రత్యేక రైళ్లు చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ రోడ్ స్టేషన్లలో ఆగనున్నాయి.

రైళ్లలో అన్ని సాధారణ బోగీలే ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సాధారణ ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. జమ్మికుంట ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# చెక్‌డ్యామ్‌తో రైతులకు తీరని నష్టం.. ఐదేళ్లుగా పంటలకు దూరం



**వీణవంక, సెప్టెంబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కల్వల-బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ ఆరోపించారు. చెక్‌డ్యామ్ కారణంగా వరద నీరు పొలాల్లోకి చేరడంతో సుమారు పది మంది రైతులు ఐదేళ్లుగా పంటలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల కారణంగా సుమారు 12 ఎకరాల వ్యవసాయ భూమి దెబ్బతిన్నట్లు తెలిపారు. బాధిత రైతుల పొలాలను పరిశీలించిన సుంకరి సంపత్.. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పంటలు సాగు చేసుకోలేక రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు దెబ్బతిన్న భూములను తిరిగి సాగుకు అనుకూలంగా మార్చే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జమ్మికుంటలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..**
- **కృష్ణనామస్మరణతో మార్మోగిన వేడుకల ప్రాంగణం**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అబ్బరవేన రాజు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తుల కృష్ణనామస్మరణతో కార్యక్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ హాజరై శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ధర్మాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరూ సత్యం, న్యాయం, మానవతా విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.అబ్బరవేన రాజు యాదవ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ వేడుకల్లో యాదవ సంఘం నాయకులు, భక్తులు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో జమ్మికుంట పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనను చూసి బీఆర్ఎస్‌కు కళ్లుమంటున్నాయి

- **కౌశిక్‌రెడ్డి ఉనికి కోసమే దొంగ డ్రామాలు : వొడితల ప్రణవ్**




**కమలాపూర్,సెప్టెంబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరుతుండటాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రూ.500 బోనస్, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సన్నబియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చుతున్నామని అన్నారు.

“ఎమ్మెల్సీగా రెండున్నరేళ్లలో నువ్వేం తెచ్చావో.. ఇంచార్జిగా నేనేం తీసుకొచ్చానో రుజువు చేస్తా.. సిద్ధమా?” అంటూ కౌశిక్‌రెడ్డికి ప్రణవ్ సవాల్ విసిరారు. కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్న కాలంలో నియోజకవర్గానికి ఎన్ని ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సన్నబియ్యం వంటి పథకాలు తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నూతన రేషన్ కార్డులు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, నూతన బస్ రూట్లు వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించామని, రాబోయే రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లతో పాటు హుజురాబాద్, జమ్మికుంటలో మరిన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు అందిస్తామని చెప్పారు.

కమలాపూర్‌కు కౌశిక్‌రెడ్డి చేసిందేమీ లేదు

కమలాపూర్ మండల అభివృద్ధికి కౌశిక్‌రెడ్డి ఎలాంటి కృషి చేయలేదని ప్రణవ్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కమలాపూర్ బస్‌స్టాండ్ నిర్మాణానికి వచ్చిన నిధులను కూడా ఎమ్మెల్సీగా ఉండి ఇప్పించలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు సమకూర్చడంతో పాటు మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.కమలాపూర్ మండలానికి మంజూరైన శ్మశాన వాటిక నిధులను వీణవంకకు తరలించారని ఆరోపించిన ప్రణవ్.. ఇది కౌశిక్‌రెడ్డి పనితీరుకు నిదర్శనమన్నారు. కమలాపూర్‌లో ఇప్పటికే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ అవినీతి ఆరోపణలకు కౌశిక్‌రెడ్డి సమాధానం చెప్పాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై ఆ పార్టీ నాయకురాలు కవిత చేసిన ఆరోపణలకు ముందుగా కౌశిక్‌రెడ్డి సమాధానం చెప్పాలని ప్రణవ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పిన తర్వాతే కాంగ్రెస్ గురించి మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమకు ప్రత్యక్ష సాక్ష్యాలని, కౌశిక్‌రెడ్డి ఒక్కసారి కళ్లు తెరిచి వాటిని చూడాలని వొడితల ప్రణవ్ అన్నారు. కార్యక్రమంలో కమలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి

- **ఇందిర మహిళాశక్తి పథకంతో మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అండ.**
- **మంత్రి ధనసరి అనసూయ (సీతక్క).**

**సత్తుపల్లి, సెప్టెంబరు 4 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛ కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమన్నారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ.6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని మంత్రి గుర్తుచేశారు. సత్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు తదితర వ్యాపారాలను ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని మంత్రి తెలిపారు. రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధంగా లోన్ బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ప్రమాదవశాత్తు మహిళలు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వరకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి లేకుండా వీవో భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక వీవో భవనాలు మంజూరు చేశామని, ఇంకా అవసరమైన భవనాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా సమాఖ్యల కోసం రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నామని, వీటిని మహిళల శిక్షణ, సమావేశాలు, వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. మహిళలకు అక్షరాస్యత కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులందరికీ చదువు నేర్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మహిళలు విద్యావంతులై తమ పిల్లలను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు అత్యవసర సమయాల్లో తమ పనుల కోసం ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లేందుకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ ప్రయోజనాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని, మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చడంతో పాటు సిబ్బందికి వేతనాలు పెంచామని తెలిపారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫాంలతో పాటు అల్పాహారం, పోషకాహారం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో లభించే సహజ వనరులు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలను మహిళలు వ్యాపారాలుగా మలచుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పపువ్వు లడ్డూల వంటి స్థానిక ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, వాటిని పరిశుభ్రంగా, నాణ్యతతో తయారు చేసి మార్కెట్ చేస్తే మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. మహిళలు నెలకు రూ.10 వేల ఆదాయంతో ప్రారంభించి లక్షలు, చివరకు కోట్లు సంపాదించే స్థాయికి ఎదగాలన్న పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమం కింద మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం కావడం విశేషమని, దాని ద్వారా నెలకు సుమారు రూ.2.50 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. చిన్న స్థాయి వ్యాపారం నుంచి పెద్ద స్థాయి పరిశ్రమల వరకు మహిళలను భాగస్వామ్యం చేస్తూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, బీమా తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా సుమారు 470 మహిళా సంఘాలు ఏర్పడటం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమన్నారు. మహిళా సంఘాలకు వారి అర్హతను బట్టి పెద్ద మొత్తంలో రుణాలు అందిస్తున్నామని, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని తెలిపారు. మహిళల కోసం ప్రమాద బీమా, లోన్ బీమా వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, లోన్ బీమా కింద ఇప్పటికే సుమారు 870 మంది సభ్యులకు ప్రయోజనం అందించామని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు, సోలార్ యూనిట్లు, ఇతర ఉపాధి కార్యక్రమాలు మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఏసీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి

- శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- ముక్కోటి, శ్రీరామనవమి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- పుష్కరాల నాటికి ఘాట్లు, పరిసరాల అభివృద్ధిపై దృష్టి

భద్రాచలం, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణలతో కలిసి భద్రాచలం ఆలయాన్ని సందర్శించిన మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిత్రకూట మండపం, గోశాల, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాలయ మార్గం, ఉత్తర ద్వారం, మాడవీధులు, రామాలయం పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల నాణ్యత, అమలు విధానం, పూర్తి చేసే గడువులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ముక్కోటి ఉత్సవాల నాటికి ఉత్తర ద్వారం పనులను పూర్తి చేయాలని, అలాగే శ్రీరామ నవమి సమయానికి మిగిలిన ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్ట్‌లు, సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. రానున్న 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి ఘాట్లు, పరివాహక ప్రాంతాల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. భక్తుల రాకపోకలు, స్నాన ఘాట్లు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

భద్రాచలం ఆలయ పరిసరాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలని పేర్కొన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, దీర్ఘకాలం నిలిచేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం తెలంగాణ రాష్ట్రానికి ఆధ్యాత్మిక చిహ్నమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ భద్రాచలాన్ని దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.





# సూరారం, శంకరయ్యపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ.2.02 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభం
- గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామన్న ఎంపీ

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని సూరారం, శంకరయ్యపల్లి గ్రామాల్లో రూ.2.02 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాతో కలిసి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ పనులు ఉపయోగపడతాయని తెలిపారు. శంకుస్థాపన అనంతరం వీగార్డ్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన 20 గ్రామాలను హెచ్‌ఎండీఏ పరిధిలో చేర్చడం శుభపరిణామమని ఎంపీ డీకే అరుణ అన్నారు. దీనివల్ల గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి మరింత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు వేర్వేరు అయినప్పటికీ ప్రజల అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీ అన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం రాజకీయ భేదాలను పక్కనపెట్టి పనిచేయడం అవసరమన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఎంపీ నిధుల ద్వారా నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని డీకే అరుణ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్య, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేలా ఉండాలని పేర్కొన్నారు. సూరారం గ్రామం అభివృద్ధిలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఎంపీ ఆకాంక్షించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాను కోరినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.





# ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటనకు పోలీసుల విస్తృత బందోబస్తు

- భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి అధికారుల దిశానిర్దేశం
- ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ కదలికలపై ప్రత్యేక సూచనలు
- అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసులకు ఆదేశాలు

వికారాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పర్యటన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి రాకపోకలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. వీఐపీ కదలికల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రోటోకాల్‌పై పోలీసులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. పర్యటన మార్గాల్లో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. పర్యటన జరిగే ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. భద్రతా పరమైన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో ఉన్న ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమ ప్రాంగణాల్లో జనసందోహ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బారికేడ్లు, ప్రవేశ నియంత్రణ, అత్యవసర సేవల ఏర్పాట్లను సమన్వయంతో అమలు చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటన విజయవంతంగా జరిగేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పోలీసు శాఖ పనిచేస్తోందని అధికారులు తెలిపారు. భద్రత, ట్రాఫిక్, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పర్యటనను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

# గద్వాల విజయలక్ష్మికి మంత్రి పొన్నం శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):



ఇటీవల రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక బాధ్యతలు నిర్వహించే అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా రూపకల్పనలో ప్లానింగ్ కమిషన్ పాత్ర ఎంతో కీలకమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణను రూపొందించడంలో కమిషన్ కీలక బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. గద్వాల విజయలక్ష్మి ప్రజాప్రతినిధిగా, హైదరాబాద్ మాజీ మేయర్‌గా పనిచేసిన అనుభవం రాష్ట్ర ప్రణాళికా వ్యవస్థకు ఉపయోగపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల నిర్వహణలో ఆమెకు ఉన్న అనుభవం రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతుందని చెప్పారు. ప్రజల సమస్యలపై అవగాహన కలిగిన నాయకురాలిగా ఆమె సేవలు కమిషన్‌కు మరింత బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అవసరాలను సమన్వయం చేస్తూ సమతుల్య అభివృద్ధికి దోహదపడే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం ద్వారా రాష్ట్ర పురోగతికి కొత్త దిశ నిర్దేశం చేయవచ్చని తెలిపారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, మౌలిక సదుపాయాల విస్తరణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల అవసరాలతో అనుసంధానం చేస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి సాధించగలదని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో అన్ని శాఖలతో సమన్వయం కీలకమని పేర్కొన్నారు. భేటీ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి కూడా రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ప్లానింగ్ కమిషన్ కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తానని ఆమె వెల్లడించారు.



# ఇంటర్ విద్యను రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి: కల్వకుంట్ల కవిత

- 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4, (తెలంగాణ ముచ్చట్లు):

ఇంటర్ విద్యను రద్దు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యా జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన "సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ జంగ్ సైరన్" సమావేశంలో పాల్గొన్న ఆమె, ఇంటర్మీడియేట్ వ్యవస్థ రాష్ట్ర విద్యా రంగానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థను తొలగించాలనే ప్రయత్నాలు విద్యార్థుల భవిష్యత్తుకు హానికరమని హెచ్చరించారు. ఇంటర్మీడియేట్ విద్య వల్ల తాను కూడా ఎంతో ప్రయోజనం పొందిన వ్యక్తినని కవిత పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో వచ్చిన సానుకూల మార్పుల ఫలితంగానే ఇంటర్ విద్య ఏర్పడిందని, తెలుగు రాష్ట్రాల్లో ఈ విధానం దేశంలోనే అత్యుత్తమంగా కొనసాగుతోందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థల్లో పనిచేస్తున్న అనేక మంది ప్రతిభావంతులైన ఇంజనీర్లు, నిపుణులు ఈ విద్యా విధానం ద్వారా ఎదిగారని తెలిపారు. అందువల్ల ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందే తప్ప, తొలగించాల్సిన అవసరం లేదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్య వంటి కీలక అంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే ముందు మేధావులు, విద్యా నిపుణులు, సంబంధిత వర్గాలతో సమగ్ర చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఒక సమావేశంలో ఇంటర్ అడ్మిషన్లు నిలిపివేయాలని ప్రకటించడం, అనంతరం బోర్డు ప్రవేశాల ప్రకటనలు విడుదల చేయడం ప్రభుత్వంలో స్పష్టత లోపాన్ని సూచిస్తోందని విమర్శించారు. ఇంటర్ విద్యను రద్దు చేస్తే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, ముఖ్యంగా బాలికలపై తీవ్ర ప్రభావం పడుతుందని కవిత అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రవాణా సదుపాయాల కొరత వంటి కారణాలతో ఇప్పటికే పలువురు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు మరింత భారమయ్యే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. విద్యా కమిషన్ చేసిన కొన్ని సిఫారసులపైనా కవిత ప్రశ్నలు లేవనెత్తారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణత శాతాన్ని 45 శాతానికి పెంచడం, మొదటి సంవత్సరం పరీక్షల విషయంలో చేసిన సూచనలపై పునరాలోచన అవసరమన్నారు. ఇంటర్ విద్యను కాపాడేందుకు అవసరమైతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కృష్ణుడిని భక్తితో మాత్రమే కాదు.. ఆలోచనతో కూడా చదవాలి

ఒక సమాజం తన చరిత్రను కేవలం పూజిస్తే అది సంస్కృతి. అదే చరిత్రను చదివి, అర్థం చేసుకుని, వర్తమాన రాజకీయాల్లో తన హక్కుల కోసం ఉపయోగించుకుంటే అది చైతన్యం. కృష్ణుడిని ఈ రెండో కోణంలో చదవాల్సిన సమయం వచ్చింది.

కృష్ణుడిని మనం ఎక్కువగా భక్తి, పూజ, దేవుడిగా చూస్తాం. వేణువు, నెమలిపింఛం, గోపికలు, భక్తి ఇవే కృష్ణుడి చుట్టూ నిర్మించబడిన సాధారణ ప్రతిరూపాలు. చిన్నప్పటి నుంచి మనకు పరిచయమైన కృష్ణుడు ఒక అందమైన బాలుడు, వేణువు వాయించే గోపాలుడు, భక్తుల చేత పూజించబడే దేవుడు. అయితే ఆ భక్తి తెరను కాసేపు పక్కకు జరిపి మహాభారతంలోని కృష్ణుడిని రాజకీయంగా చదివితే, పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వం మన ముందుకు వస్తుంది. కృష్ణుడు కేవలం వేణువు పట్టుకున్న గోపాలుడు కాదు. పరిస్థితులను లోతుగా అర్థం చేసుకున్న రాజకీయ ఆలోచనాపరుడు. సంబంధాలను నిర్మించగలిగిన దౌత్యవేత్త. అవసరమైనప్పుడు వ్యూహాన్ని మార్చగలిగిన రాజకీయ వ్యూహకర్త. మహాభారతంలో కృష్ణుడు అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తిగా కనిపించడు. తనకు అనుకూలమైన రాజకీయ ఫలితాన్ని సాధించడానికి వివిధ శక్తులతో సంబంధాలు నిర్మించుకున్నాడు. ఎవరి బలం ఎక్కడ ఉందో అర్థం చేసుకున్నాడు. ఏ సందర్భంలో ఎవరి పక్షాన నిలబడాలో, ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలో పరిస్థితికి అనుగుణంగా వ్యవహరించాడు. ఇక్కడే కృష్ణుడి నుంచి రాజకీయంగా నేర్చుకోవాల్సిన విషయం ఉంది. రాజకీయాల్లో భావోద్వేగం ఒక్కటే సరిపోదు. పరిస్థితిని చదవాలి. ప్రతిపక్షాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజల బలాన్ని గుర్తించాలి. సంబంధాలను నిర్మించాలి. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలి.

అయితే కృష్ణుడిని ఆదర్శంగా తీసుకోవడం అంటే ఆయన చేసిన ప్రతి పనినీ సమర్థించడం కాదు. ఆదర్శం అంటే విమర్శనాత్మకంగా ఆలోచిస్తూ, అందులో మనకు ఉపయోగపడే విలువలను స్వీకరించడం. కృష్ణుడిని పూజించడం ఒక వ్యక్తిగత విశ్వాసం. కృష్ణుడిలోని నాయకత్వాన్ని అర్థం చేసుకోవడం ఒక మేధోపరమైన ప్రయాణం. ఆ నాయకత్వ లక్షణాలను సమాజం కోసం ఆచరించడం ఒక సామాజిక ఆదర్శం. కృష్ణుడిని ఆలోచనగా చదివినప్పుడు మరో కృష్ణుడు కనిపిస్తాడు.

కృష్ణుడు స్వయంగా సింహాసనంపై కూర్చొని సామ్రాజ్యాన్ని పాలించలేదు. కానీ సింహాసనాల వెనుక నడిచే రాజకీయాలను అర్థం చేసుకున్నాడు. సంబంధాలను నిర్మించాడు. మిత్రబంధాలను బలపరిచాడు. శక్తుల మధ్య సమీకరణాలను అంచనా వేశాడు. యుద్ధం తప్పనిసరి కాకముందు దౌత్యానికి అవకాశం ఇచ్చాడు. పరిస్థితులు మారినప్పుడు వ్యూహాన్ని మార్చాడు. ఇదే రాజకీయ వాస్తవికత. రాజకీయాలు కేవలం మంచి మనసుతో గెలవబడవు. కేవలం ఆవేశంతో కూడా గెలవబడవు. నినాదాలతో ప్రజలను కొంతకాలం కదిలించవచ్చు. కానీ శాశ్వతమైన సామాజిక శక్తిని నిర్మించాలంటే సంస్థలు, వ్యూహం, నాయకత్వం, సంబంధాలు, అధ్యయనం అవసరం. ముఖ్యంగా పరిస్థితిని చదివే తెలివి కావాలి.

కృష్ణుడిని దేవుడిగా మాత్రమే చూస్తే మనం ఆయనను పూజిస్తాం. కృష్ణుడిని రాజకీయ పాత్రగా చదివితే ఆయనను ప్రశ్నిస్తాం. ప్రశ్నించడం వల్ల విశ్వాసం తగ్గాల్సిన అవసరం లేదు. కొన్ని సందర్భాల్లో ప్రశ్నించడమే జ్ఞానానికి మొదటి మెట్టు. ఈరోజు భారతీయ రాజకీయాల్లో చరిత్ర, పురాణాలు, మత ప్రతీకలు రాజకీయ ప్రచారంలో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. కానీ ఆ ప్రతీకలలోని సామాజిక, రాజకీయ పాఠాలపై గంభీరమైన అధ్యయనం మాత్రం చాలా తక్కువ. ప్రతీకలను రాజకీయంగా ఉపయోగించుకోవడం అందరికీ తెలుసు. ప్రతీకల నుంచి రాజకీయంగా నేర్చుకోవడం మాత్రం అందరికీ తెలియదు.

కృష్ణుడిని ఈ రెండింటి మధ్య తేడాను అర్థం చేసుకునే అవకాశంగా చూడాలి. యాదవ సమాజానికి ఇది మరింత ముఖ్యమైన విషయం. ఒక సాంస్కృతిక ప్రతీకను కేవలం కుల గర్వానికి పరిమితం చేయడం వల్ల దాని సామాజిక సామర్థ్యం చిన్నదైపోతుంది. కృష్ణుడి పేరును కేవలం ఒక గుర్తింపుగా ఉపయోగించడం కంటే, ఆ గుర్తింపును విద్య, ఆర్థిక అభివృద్ధి, సామాజిక గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం, సంస్థాగత శక్తిగా మార్చడం అవసరం. ఇది యాదవ సమాజానికే కాదు, మొత్తం బీసీ సమాజానికి వర్తించే ప్రశ్న.

దేశ జనాభాలో పెద్ద భాగాన్ని కలిగి ఉన్నప్పటికీ రాజకీయ, పరిపాలనా, ఆర్థిక, మేధోపరమైన ప్రాతినిధ్యంలో తమ బలానికి తగిన స్థానం లభించలేదనే భావన బీసీ సమాజాల్లో ఉంది. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం జనాభా లెక్కలు సరిపోవు. ఆ జనాభాను చైతన్యంగా, సంఘటితంగా, విద్యావంతంగా, రాజకీయంగా ప్రభావవంతంగా మార్చే సంస్థాగత నిర్మాణం అవసరం. అక్కడే కృష్ణుడి నుంచి నేర్చుకోవాల్సిన అసలు పాఠం ఉంది. బలం ఉండటం ఒక విషయం. ఆ బలాన్ని రాజకీయ శక్తిగా మార్చడం మరో విషయం.

కృష్ణుడిని పూజించడం ఒక వ్యక్తిగత విశ్వాసం. కృష్ణుడిలోని నాయకత్వాన్ని అర్థం చేసుకోవడం ఒక మేధోపరమైన ప్రయాణం. ఆ నాయకత్వ లక్షణాలను నైతికతతో, ప్రజాస్వామ్య విలువలతో, సామాజిక న్యాయంతో సమాజం కోసం ఆచరించడం ఒక సామాజిక ఆదర్శం. కృష్ణుడిని ఎంతగా పూజిస్తున్నామన్నది కాదు. కృష్ణుడి నుంచి మనం ఏమి నేర్చుకుంటున్నాం అన్నదే అసలు ప్రశ్న.

కృష్ణుడిని కేవలం పూజించడమే కాదు, చదవాలి. ప్రశ్నించాలి. విశ్లేషించాలి. అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఒక సమాజం తన ప్రతీకలను ఎంత పెద్దగా పూజించిందన్నదానికంటే, వాటి నుంచి ఎంత పెద్ద సామాజిక చైతన్యాన్ని నిర్మించిందన్నదే ఆ సమాజం యొక్క రాజకీయ బలాన్ని నిర్ణయిస్తుంది.

కృష్ణుడిని రాజకీయంగా చదవడం అంటే ఆయనను ఒక కులానికి పరిమితం చేయడం కాదు. ఒక పురాణపాత్రను కేవలం "మనవాడు" అని ప్రకటించుకోవడం కూడా కాదు. ఆయన కథలో కనిపించే రాజకీయ పద్ధతులను విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి, మన సమాజానికి అవసరమైన పాఠాలను తీసుకోవడం. ముఖ్యంగా బీసీ సమాజాలు తమ చరిత్రను, తమ ప్రతీకలను కేవలం పూజా సంస్కృతిలోనే కాకుండా సామాజిక, రాజకీయ చైతన్యంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

చరిత్రను కేవలం గర్వించడానికి ఉపయోగిస్తే అది గతం. అదే చరిత్ర నుంచి భవిష్యత్తును నిర్మించుకోవడం నేర్చుకుంటే అది రాజకీయ శక్తి.



-బసడ
సంపత్ యాదవ్
7032132593





## మానసిక వైకల్యం బలహీనత కాదు..

# ప్రత్యేక శక్తి!



- 30 ఏళ్లుగా వేలాది మందికి అండగా ఫాదర్ జెరోమ్
- 210 మందికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయం..
- వృద్ధులు, వితంతువులకూ చేయూత

ధర్మసాగర్,సెప్టెంబర్4 (తెలంగాణ ముచ్చట్లు): మానసిక వైకల్యం కలిగిన వారిని బలహీనులుగా కాకుండా, వారిలోని ప్రత్యేక శక్తిని గుర్తించి ప్రోత్సహించాలని ఫాదర్ జెరోమ్ పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని జీవధార సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక సహాయ కార్యక్రమంలో ఆయన మానసిక వైకల్యం కలిగిన వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు.

'మానసిక వికలాంగులకు చేయూత' కార్యక్రమంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి 210 మందికి ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వితంతువులు, వృద్ధులకు కూడా ప్రత్యేకంగా ఆర్థిక సాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు.

"మానసిక వైకల్యాన్ని బలహీనతగా చూడొద్దు.. వారిలోని ప్రత్యేక శక్తిని గుర్తించండి. ప్రేమ, ఆప్యాయతతో ఆదరిస్తే వారు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగగలరు" అని ఫాదర్ జెరోమ్ అన్నారు.సుమారు 30 ఏళ్ల క్రితం కేవలం ఐదుగురితో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం నేడు వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన తెలిపారు. అవసరమైన వారి ఇళ్లకు వెళ్లి నిత్యావసర సరుకులు, ఇతర సహాయాలను అందించడంతో పాటు వివిధ ఆశ్రమాలను సందర్శించి అక్కడి వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మానసిక వైకల్యం కలిగిన వారు, వృద్ధులు, వితంతువులతో కలిసి ఫాదర్ జెరోమ్ అల్పాహారం, భోజనం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఆత్మీయంగా పలకరించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# దేశంలో నంబర్ వన్ రష్మిక!



జాతీయ స్థాయిలో రష్మిక మందన్న మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రముఖ జాతీయ పత్రిక 'ఇండియా టుడే' దేశంలోని అగ్ర కథానాయికల జాబితాలో రష్మికకు మొదటి స్థానం కల్పించినట్లు సమాచారం. ఆమెను 'కొత్త జాతీయ తార'గా అభివర్ణిస్తూ ప్రత్యేక కథనాన్ని ప్రచురించినట్లు తెలుస్తోంది.

వరుస విజయాలతో రష్మిక తన పాన్ ఇండియా స్థాయిని మరింత పెంచుకున్నారు. 'పుష్ప: ది రైజ్', 'యానిమల్', 'పుష్ప2: ది రూల్', 'ఛావా' వంటి చిత్రాలతో దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. విభిన్న భాషల్లో నటిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా, కథానాయికగా తన మార్కెట్ స్థాయిని కూడా పెంచుకున్నారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.


ఇండియా టుడే జాబితాలో దీపికా పదుకోన్, శ్రద్ధా కపూర్, అలియా భట్, సాయి పల్లవి వంటి ప్రముఖ కథానాయికలను వెనక్కి నెట్టి రష్మిక అగ్రస్థానంలో నిలిచినట్లు సమాచారం. దీంతో ఆమెకు దక్కిన ఈ గుర్తింపు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రష్మిక వరుసగా భారీ చిత్రాల్లో భాగం కావడం, ఆయా సినిమాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఆమెకు కలిసొచ్చిన అంశాలుగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా 'పుష్ప' చిత్రంలోని శ్రీవల్లి పాత్రతో ఉత్తరాది ప్రేక్షకుల్లోనూ ఆమెకు విపరీతమైన ఆదరణ లభించింది. ఆ తర్వాత 'యానిమల్', 'పుష్ప2', 'ఛావా' వంటి చిత్రాలు ఆమెకు మరింత జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చాయి.

ఈ అరుదైన గుర్తింపుపై రష్మిక భర్త, హీరో విజయ్ దేవరకొండ కూడా ఆనందం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇండియా టుడే పత్రిక ముఖచిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న విజయ్.. రష్మికను అభినందిస్తూ ఆమె సాధించిన విజయంపై గర్వంగా ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆయన చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచాయి.

విజయ్ దేవరకొండ అభినందనలతో పాటు సినీ అభిమానులు కూడా రష్మికకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు చెబుతున్నారు. దక్షిణాది కథానాయికగా కెరీర్‌ను ప్రారంభించి జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమని అభిమానులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రష్మిక చేతిలోనూ పలు భారీ చిత్రాలు ఉన్నాయి. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆమెకు జాతీయ స్థాయిలో లభిస్తున్న గుర్తింపు భవిష్యత్ చిత్రాలపై అంచనాలను మరింత పెంచుతోంది.



# గురువుకు వందనం

క్షీరము నిచ్చేది ధేనువు
జ్ఞానము నిచ్చేది గురువు
దేవ గురువు బృహస్పతి
గురుదేవుడేప్పుడూ
సరస్వతే!!

అజ్ఞానం నుండి విజ్ఞానం
వైపు నడిపించేది గురువు
మంచి మనిషిగా
తీర్చిదిద్దేది గురువు
మంచిని బోధించేది
గురువు
గురువు లేని విద్య గుడ్డి
విద్య!!

విజ్ఞానం పంచేది గురువు
తన విద్యను ధారపోసేది

గురువు
ప్రపంచంలో అన్నిటికీ
రెండు కొమ్ములే ఉంటే
మూడు కొమ్ములు
ఉన్నవాడు గురువు!!

గు = 1 రు = 2 వు = 3

జాతీయ ఉపాధ్యాయ
దినోత్సవం సందర్భంగా..



దేవులపల్లి రమేశ్.
తెలుగు ఉపాధ్యాయులు, మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల
చరవాణి :-9963701294

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in